# క్రాస్‌రోడ్స్

టపాలో వచ్చిన ఉత్తరాల్లో ఆ కవర్ ప్రత్యేకంగా కనబడింది. తీసి చూశాను.

న్యూయార్క్ పోస్ట్‌మార్క్ ఉంది. ఫ్రమ్ అడ్రస్, డయానా కార్పొరేషన్, న్యూయార్క్ అని ఉంది.

కవర్ చించి అందులోని కాగితాల్ని తీశాను, ఆరు పేజీల ఉత్తరం. పేజీల మధ్యనుండి ఓ కలర్ ఫోటోగ్రాఫ్ కింద పడింది. ఫోటోలో ఓ జంట నవ్వుతూ ఉంది. 'ఫార్చ్యూన్' మాగజైన్ పేజీల్లోనూ, 'బిజినెస్ వీక్' కవర్ పేజీల మీదా కనిపించే ఎగ్జిక్యూటివ్ టైప్ వ్యక్తి. డార్క్‌సూట్... రెడ్ టై... నవ్వుతున్నాడు.

అతణ్ణి నే నెక్కడో చూసినట్లుగా అనిపించింది. అతడి నడుం చుట్టూ చేయి వేసి ఓ నీలం కళ్ళ బ్లాండ్ పిల్ల మెరుస్తున్న పళ్ళన్నీ కనబడేలా హాపీగా నవ్వుతోంది. ఆ పిల్ల మెడని ముత్యాల హారం మృదువుగా కౌగలించుకుంటోంది.

బలంగా ఆరోగ్యంగా వున్న ఆ జంట ఆనందంతో వెలిగిపోతున్నారు. వాళ్ళ చేతుల్లో బొద్దుగా బొమ్మలా ముద్దుగా వున్న పసివాడు నీలం కళ్ళు పెద్దవి చేస్తూ కెమెరా వంక చూస్తున్నాడు.

ఎవరు వీళ్లు?

బహుశా ఎవరికో వచ్చిన ఉత్తరాన్ని నేను ఓపెన్ చేయలేదు గదా! మళ్ళీ చూశాను. కవర్ మీద డాక్టర్ శశిధర్ సూపరింటెంట్ ఆఫ్ హెడ్ క్వార్టర్స్ హాస్పిటల్, అని వుంది.

లెటర్ మీద అడ్రెస్ ఇలా వుంది.

మాక్స్ బ్రాండన్.

వైస్ ప్రెసిడెంట్.

డయానా కార్పొరేషన్.

ఆపేరు ఎక్కడో విన్నాను. ఆ వ్యక్తిని ఎక్కడో చూశానేమో. నా ముప్పై

నాలుగేళ్ళ సర్వీస్‌లో ఎన్నో వేల మంది రోగులకి ట్రీట్‌మెంట్ ఇచ్చాను. మరి కొద్ది నెలల్లో రిటైర్ కాబోతున్న డాక్టర్ని.

స్టీరియోమీద బేగం అక్తర్ గజల్స్ పాడుతోంది.

మాక్స్.... మాక్స్... హు ది హెల్ ఈజ్ దిస్‌మాక్స్?

"డియర్ డాక్టర్ శశిధర్,

నన్ను మరిచిపోయి ఉంటారనుకుంటున్నాను. నేను ఇండియాలో..."

చప్పున జ్ఞాపకం వచ్చింది.

మై గాడ్! ! పదహారేళ్ళ క్రితం జరిగిన సంఘటన కళ్ళముందు తిరిగింది. ఆనాడు...

సాయంత్రం చీకట్లు కమ్ముకుంటున్న సమయంలో నేను బంగళా బయట లాన్‌లో నడుస్తున్నాను. పక్కనే బ్రూసీ తోకాడించుకుంటూ నా వెనకే తిరుగుతోంది.

దీపిక వంటింట్లో పురమాయిస్తూ రాత్రి భోజనానికి ఏర్పాట్లు చేస్తోంది.

అక్టోబర్ సాయంత్రం... కొద్దిగా చలిగా ప్లెజంట్‌గా ఉంది. విరగబూసిన గులాబీల పరిమళం గాలిలో కలిసి మత్తెక్కిస్తోంది. చివరివరకూ కాలిన సిగరెట్‌ని గులాబీ పొదల్లోకి విసిరి కుర్చీలో కూర్చోబోతుండగా ఓ జీప్ వచ్చి ఆగింది. అందులో నుండి టౌన్ ఇన్‌స్పెక్టర్ రమణారావు దిగాడు.

నన్ను చూసి సెల్యూట్ చేశాడు.

"వాట్ రమణారావ్ ఏమిటి సంగతి? అన్నాను.

"డాక్టర్ మీకో కేసు"

నవ్వాను

"ఏ కేసు? మరో హిట్ అండ్ రన్ కాదు కదా కొంప దీసి?"

"నో! మీరే చూడండి" అన్నాడు జీప్ వంకకు చూపిస్తూ.

"ఏం జరిగింది?"

"రాంపూర్ గ్రామం బయట రోడ్డుమీద పడి ఉంటే గ్రామస్థులు ఫిర్యాదు చేస్తే వెళ్ళి జీప్‌లో తీసుకు వచ్చాం డాక్టర్. ఎలాగూ మీ బంగళా దారిలోనే కదాని ఇలా వచ్చాను. చెప్పి హాస్పిటల్‌కి తీసుకుపోదామని".

ఇద్దరు కానిస్టేబుల్స్ ఆసరాతో ఒకణ్ణి దాదాపు సగం ఈడుస్తూ సగం మోస్తూ వస్తున్నారు. అతడి వంటిమీద జుగుప్సాకరమైన మురికి గుడ్డలు. లాల్చీ బాగా చిరిగిపోయి ఉంది. పైజామా వాలికలయి నల్లటి బురద మరకలతో ఉంది. అన్నిటినీ మించిన భయంకరమైన దుర్వాసన అంత దూరంనుండే ముక్కులు బద్దలు కొడుతోంది.

ఆ వ్యక్తి ముఖం కేసి చూశాను. ఎవడో ఫారినర్! సంజె చీకటిలో ఏదీ స్పష్టంగా కనబడడం లేదు. పొడుగాటి జుట్టు మురికిగా జడలు జడలుగా భుజాల మీదికి సాగి వుంది. మీసాలు గడ్డాలూ బాగా పెరిగి వున్నాయి. స్పృహలో ఉన్నట్టులేడు.

"ఎవరితడు?" అడిగాను.

"ఎవడో హిప్పీ డాక్టరుగారూ! ఏ దేశంవాడో తెలియకుండా వుంది. దాదాపు చావు

బ్రతుకుల మధ్య రోడ్డుమీద పడి వున్నాడు. ఐడెంటిఫికేషన్‌కి అతడి దగ్గర ఏ కాగితాలూ లేవు డాక్టర్".

"సరే ముందు ఇతణ్ణి హాస్పిటల్‌కి తీసుకెళ్ళండి. నేను కూడా మరో ఐదు నిమిషాల్లో బయలుదేరి వస్తున్నాను".

కానిస్టేబుల్స్ హిప్పీని మళ్ళీ ఈడ్చుకుంటూ తీసికెళ్ళి జీప్ వెనుక భాగంలో పడేశారు. జీప్ వెళ్ళిపోయింది.

హాస్పిటల్‌కి ఫోన్‌చేసి అంతా సిద్ధం చేయమని ఆదేశించాను. ఎమర్జన్సీ కేస్ అని దీపికతో చెప్పాను.

"మీకు అన్నీ ఎమర్జెన్సీ కేసులే! త్వరగా వచ్చేయండి! ఎదురుచూస్తుంటాను" అంది నవ్వుతూ.

"ప్రయత్నిస్తాను మై డియర్!" అన్నాను.

ఆ తర్వాత నాలుగు రోజులూ దాదాపు నరకప్రాయంగా గడిచాయి. మాల్ న్యూట్రిషన్.. డ్రగ్ ఎడిక్షన్... విత్‌డ్రాయల్... చాలా దారుణంగా ఉంది. వయొలెంట్‌గా ప్రవర్తించాడు ఆ హిప్పీ.. పగళ్ళూ రాత్రులూ నానా యాతనా అనుభవించాడు..

ఎలాగైతేనేం చావు తప్పించుకున్నాడు. సెడేషన్‌లో ఉంచవలసి వచ్చింది. మేట్రన్ సుశీలమ్మ హిప్పీని చాలా ఆదరంతో చూసి సేవ చేసింది. ఆమె సపర్యల వల్ల క్రైసిస్ నుండి బయటపడి తేరుకున్నాడు.

స్పృహ వచ్చిన తర్వాత రెండు రోజుల పాటు విపరీతమైన డిప్రెషన్‌లో వున్నాడు. ఎలాగైతేనేం కాస్త తిండి సయించి మామూలు మనిషయే సరికి దాదాపు పది రోజులు పట్టింది.

ఈ మధ్యలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టరు రామిరెడ్డి వచ్చి అతడితో మాట్లాడి స్టేట్‌మెంట్ తీసుకున్నాడు పై అధికారులకి పంపించే నిమిత్తమై.

మాక్స్ బ్రాండన్ అనే అమెరికన్ హిప్పీ పాస్‌పోర్ట్ వీసా వంటి కాగితాలు ఏమీ లేకుండా అపస్మారకంగా పడివుంటే అతణ్ణి హాస్పిటల్లో చేర్చిన విషయం అతడు ఈ రాష్ట్రంలో ఏయే ప్రాంతాల్లో తిరిగిందీ, ఈ దేశం ఎప్పుడు వచ్చింది, ఏమేమి చేసిందీ అన్నీ వివరంగా తీసుకొని రిపోర్ట్ పంపాడు.

పోలీసువారు చేయవలసిన కార్యక్రమం మొదలు పెట్టారు.

ఆరోజు ఉదయం రౌండ్స్‌లో అతడిని చూశాను. శుభ్రంగా మామూలు మనిషిలా ఆరోగ్యంగా ఉన్నాడు.

"హౌ ఆర్యూ మిస్టర్ బ్రాండన్?"

"ఫైన్ డాక్టర్ – థాంక్స్ టు యు అండ్ సుషీలమా"

మేట్రన్ సుశీలమ్మ నవ్వింది–లావుగా ఉందామె.

"మా డ్యూటీ అది బ్రాండన్. యు లుక్ మచ్ బెటర్. మళ్ళీ డ్రగ్స్ మీదికి మనసు పోతున్నదా?"

నవ్వాడు.

"నో డాక్టర్"

"వెరీ గుడ్. మరి నీ తరువాత కార్యక్రమమేమిటి? ఆలోచించావా?"

"ఎస్ డాక్టర్. పోలీసు డిపార్ట్‌మెంట్ ఢిల్లీ ఎంబసీకి మెసేజ్ పంపారట. నాకు మా డాడీ న్యూయార్క్‌కి రిటర్న్ టికెట్, మళ్ళీ పాస్‌పోర్ట్, వీసా, కొంత డబ్బూ పంపుతున్నట్లుగా వైర్‌లెస్ వచ్చింది. అంతా సవ్యంగా జరిగితే నేను మరో రెండుమూడు రోజుల్లో మా దేశం వెళ్ళిపోతాను."

"చాలా సంతోషం బ్రాండన్. గుడ్ లక్" అని వెళ్ళిపోయాను.

ఓ రెండు రోజుల తర్వాత అతడికి కొత్త పాస్‌పోర్ట్, వీసా, ఇతర కాగితాలూ వచ్చాయి. మిగిలిన ఫార్మాలిటీస్ పూర్తయ్యాయి. అతడి తండ్రి వద్ద నుండి కొంత డబ్బు, రిటర్న్ టికెట్ ఎంబసీ ద్వారా వచ్చాయి. కొత్త పైజామా, లాల్చీ వేసుకుని నన్ను చూట్టానికి వచ్చాడు బ్రాండన్.

ఆ రోజునే బస్సులో హైదరాబాద్ వెళ్ళి అక్కణ్ణుంచి సాయంత్రం ఢిల్లీకి పోయి మరునాడు తెల్లవారుజామున న్యూయార్క్ ఫ్లైట్‌కి వెళ్ళిపోవడం, స్థూలంగా ఇదీ అతడి ప్రోగ్రామ్.

"నీ ఆరోగ్యం ఎలా వుంది బ్రాండన్?"

"మీ దయవల్ల చాలా బాగుంది డాక్టర్. యు సేవ్డ్ మి" అన్నాడు.

"కమాన్ బ్రాండన్. నీవు కూడా బాగా సహకరించావు. సామాన్యంగా నీలాంటి డ్రగ్ ఎడిక్షన్ కేసెస్‌లో చాలా రెసిస్టెన్స్ ఉంటుంది. డ్రగ్ విత్‌డ్రాయల్ చాలా భయంకరమైన అనుభవం. కాని నీవు చాలా బాగా తట్టుకున్నావు".

"యు ఆర్ వెరీ కైండ్ డాక్టర్. నేను వెళ్ళిపోతున్నాను... వెళ్ళి ఏం చేయాలో అర్థం కావడం లేదు డాక్టర్. ఎన్నో ఏళ్ళుగా ఏమీ చేయకుండా బలాదూరుగా తిరుగుతున్నాను. ఇప్పుడు మళ్ళీ మా దేశానికి పోయి ఎలా ఎడ్జస్ట్ అవాలో తెలియడం లేదు" అతడి కంఠంలో ఆవేదన తొంగి చూసింది.

"ఇక్కడ ఉండి ఆలోచిస్తే అలాగే ఉంటుంది బ్రాండన్. ముందు మీ దేశం వెళ్ళి అక్కడ ఆలోచించుకో" అన్నాను.

"మీరు చెప్పిందే కరెక్ట్ అనుకుంటాను డాక్టర్. కాని నేను మీ దేశం ఎందుకు వచ్చానో మీకు తెలుసా?"

"నో"

"మీకు తెలుసుకోవాలని ఉందా?"

"నీకు చెప్పాలని వుంటే వినడానికి అభ్యంతరం లేదు బ్రాండన్"

"ఎస్! నాకు చెప్పాలని వుంది. నన్ను రక్షించిన వ్యక్తి మీరు".

టీ తెప్పించాను. సిప్ చేస్తూ తన కథ చెప్పాడు మాక్స్ బ్రాండన్.

నేను పుట్టింది టెక్సాస్‌లో. మా డాడీ వ్యాపార నిమిత్తం నా చిన్నతనంలో

న్యూయార్క్ వెళ్ళి సెటిల్ అయ్యాడు. నేను అక్కడే పెరిగాను. మన్‌హాటన్ పబ్లిక్ స్కూల్లో చదువుతున్న రోజుల్లో నేను వెస్ట్రన్ సంగీతాన్ని అభ్యసించాను.

మొదటి నుండి నాకు సంగీతమంటే వ్యామోహం. నేను కూడా సింఫొనీలు సృష్టించాలని ఆరాటపడుతుండే వాణ్ణి. ప్రతి రాత్రీ మా అపార్ట్‌మెంట్‌లో ఎంతలేటయినా పియానో మీద గంటలకొద్దీ ప్రాక్టీస్ చేసేవాణ్ణి. ప్రపంచంలోని ఎన్నో తరాల టీనేజర్ల జీవితాలని మార్చివేసే రాక్ఎన్‌రోల్ యుగం అప్పుడే ప్రారంభమైంది. బిల్ హేలీ, కొమెట్స్‌తో మొదలైన ఈ సంగీత తరంగం ఎల్విస్ ప్రెస్లీ, క్లిఫ్‌రిచర్డ్, రికీనెల్సన్, కోనీ ఫ్రాన్సిస్, బాబీ డారిన్, పాల్ యాంకా వంటి సింగర్స్ వల్ల మా తరం మీద చెప్పలేని ముద్ర వేసింది. ఆ పాటలు నాకు నచ్చడం మొదలుపెట్టాయి.

'రాక్ ఎరౌండ్ ది క్లాక్', 'బ్లూస్వేడ్ షూస్', 'హౌండ్ డాగ్', 'జెయిల్ హౌస్ రాక్', 'హార్ట్ బ్రేక్ హొటెల్', 'లవ్‌మి టెండర్', 'డయానా', 'లిప్‌స్టిక్ ఆన్ యువర్ కాలర్', 'మేక్ ది నైఫ్' వంటి పాటలు పెద్ద హిట్స్ ఆ రోజుల్లో. అదే సమయంలో నేను క్లాసికల్ మ్యూజిక్ నుండి రాక్ దిశగా డ్రిఫ్ట్ అయాను.

అప్పటికే నా ఫ్రెండ్స్ చాలా మంది గ్రూప్స్‌గా మారి రాక్ మ్యూజిక్‌కి అంకితమై పోయారు. మెదడుని ఆలోచించనీయని.. శరీరాన్ని ఉర్రూతలూగించే మ్యూజిక్ రాక్... దానికి సరైన గ్రామర్ లేదు... శబ్దం... బీట్... గుండెల్ని అదరగొట్టే బీట్... రక్తాన్ని మరిగించి... ఒళ్ళంతా వేడెక్కించి.. నరాలకి తీపి బాధనందించి... వేరే లోకాల్లోకి తీసుకుపోయే నిరంతర ధ్వని... చెవులు బద్దలయ్యేలా యాంప్లిఫైడ్ మ్యూజిక్ వినడం... ఆ బీట్‌లో... ఆ డ్రమ్స్ మోతలో.. శరీర స్పందనతో మునిగిపోవడం.... కోప్యులేషన్ లాంటి సుఖం... జన్మసాఫల్యం అనిపించేది.

ఇది అర్థంకాని వాళ్ళకి అదే సంగీతం గుండెల్లో కత్తులు కస్సున దిగే తరుణంలో పుట్టే ఆర్తనాదాలూ... సోలార్‌ప్లెక్సస్‌లో ధన్‌మని పిడికిలిగుద్దు తిన్నప్పుడు బాధతో వచ్చే మూలుగులు.. జిలార్పులు.. బలిపశువుల అరుపులూ... పగిలే రాళ్ళమీద పడే సుత్తిదెబ్బల చప్పుడు.. మతి పోగొట్టే కాకాఫోనీ అనిపించడంలో ఏమాత్రం ఆశ్చర్యం లేదు. రాక్..రాక్.. మ్యూజిక్ ఫర్ ది యంగ్ ఎట్ హార్ట్!... మ్యూజిక్ ఫర్ ది హాంటెడ్ సోల్... సిగ్నేచర్ ట్యూన్ ఆఫ్ ఎ హోల్ జెనరేషన్!...

"ఇదే సమయంలో అట్లాంటిక్ సముద్రానికి అవతల మరో యుగం ప్రారంభమయింది. అదే బీటిల్స్ యుగం. బీటిల్స్ రాకతో లండన్ మ్యూజిక్ కాపిటల్ ఆఫ్ ది వరల్డ్ అయింది. అక్కడే ఎన్నో గ్రూప్స్ ఉద్భవించాయి. 'రోలింగ్ స్టోన్స్' వంటివి.

ప్రపంచంలోని ప్రతి సిటీలోనూ బీటిల్స్ ఇమిటేషన్... వాళ్ళ హెయిర్ స్టయిల్‌ని అనుకరిస్తూ వాళ్ళ పాటల్ని వినడం సాధారణం అయింది. వేలాది గ్రూప్స్ తయారవడం, వాళ్ళు విడిపోయి వేరే గ్రూప్స్‌గా మారడం మామూలు ఐపోయింది. అది మ్యూజిక్ ప్రపంచంలో పెద్ద టర్నింగ్ పాయింట్. మరో విప్లవం... నావంటి వాళ్ళు ఎందరో ఈ విప్లవ తరంగంలో పడి దారీ తెన్నూ లేని లోకాల్లోకి కొట్టుకొని పోయారు.

నేను హైస్కూల్స్ ఎడ్యుకేషన్ అయిపోగానే చదువుకి స్వస్తి చెప్పి, ఇంట్లో చెప్పా చెయ్యకుండా లండన్ వెళ్ళిపోయాను. నన్ను నేను తెలుసుకుందామనీ.. ప్రపంచాన్ని చూద్దామనీ.. నా తల్లిదండ్రులకి చిన్న ఉత్తరం రాసి న్యూయార్క్ వదిలాను. గమ్యం లేకుండా తిరిగే హిప్పీ జెనరేషన్‌లో ఒకడిగా మారాను.

చదువులేని.. డబ్బులేని.. సరైన తిండి లేని.. దారీ తెన్నూ లేని... లండన్‌లో ఏం చేయాలో తెలీక తిరిగి అజ్ఞానంతో దగా పడ్డ తరం హిప్పీ జెనరేషన్.. ఒకటే ధ్యాస.. క్విక్ ఫిక్స్.. గెట్ హై..ఫాస్ట్‌ఫక్ కూలిట్ బేబీ! బీట్.. బీట్..బీటిట్.. గిన్స్‌బర్గ్ వేదాంతం.

I saw the best minds of my generation destroyed by
madness starving hysterical naked
dragging themselves to the negro streets at dawn
looking for an angry fix
angelheaded hipsters burning
for the ancient heavenly
connections to the starry
dynamo in the machinary of night
Whose poverty and tatters and
hallow-eyed and high sat
up smiling in the super
natural darkness of cold
water flats floating,
across the tops of the
cities contemplating jazz.

(ఇదంతా బ్రాండన్ మెల్లగా అమెరికన్ యాక్సెంట్‌తో చెప్పాడు.)

ఫెర్లింగెటీ పొయిట్రీ... హెర్మన్ హెస్ నవలలూ...రిజెక్ట్ ఎవిరిథింగ్.. ఫ్లవర్ చిల్డ్రన్... పువ్వులన్నీ ఎక్కడికి పోయాయి?... వానలకి వాళ్ళేం చేశారు?....

బాబ్ డిలన్ పాటలు.. జోన్ బేయెజ్ గొంతులోని నైరాశ్యం. బీటిల్స్ అమాయకపు లిరిక్స్ ఐ వానా హోల్డ్ యువర్ హాండ్..లెటిట్ బి.. యస్టర్ డే..స్ట్రాబెర్రీ ఫీల్డ్స్ ఫరెవర్.. సార్జెంట్ పెప్పర్.. యాబీ రోడ్. నెత్తురు ఆవిరి అయేలా... మెదణ్ణి ప్రేల్చేసే హై ఎనర్జీ సౌండ్...ఇట్ వజ్ హెవెన్...ఇట్ వజ్ హెల్...

అదీ మా జీవితం. అలౌకిక మరణ సదృశం. వీటన్నిటికి తోడు గంజాయి దమ్ముల స్వర్గ ధామాలు..హెరాయిన్.. ఎలెస్డీలు సృష్టించే సైకడలిక్ రంగుల కలలు.

మేమంతా ధర్మాబమ్స్..... ఆన్ ది రోడ్.... సబ్ టరేనియన్ జీవితాలు.... క్షణం నుండి క్షణానికి జీవించే.. నిర్లిప్తత... నిరాసక్తత... నిర్వేదం.. థింక్! వాట్‌ఫర్? హూజ్‌సేక్! ఫర్ గాడ్స్ సేక్ మాన్! బట్ గాడ్ ఈజ్ డెడ్!

ఈ సమయంలో నేను రవిశంకర్ సంగీతం విన్నాను. రాయల్ ఆల్బర్ట్ హాల్లో రవిశంకర్ కన్సర్ట్.. అల్లారఖా తబలా హాషిష్ మత్తులో.. ఉడ్‌స్టాక్ ఫెస్టివల్లో... సితార్ వాయిద్యం నా నరాల తంత్రుల్ని మీటి స్నిగ్ధమైన మనోహరమైన స్వరతరంగాల్ని సృష్టించి నా గుండెల్లో జలతారుల్ని నేసింది.

అప్పటివరకూ విన్న డ్రమ్స్ శబ్దంకన్నా అల్లా తబలా నా గుండెల్లో మెత్తటి వెల్వెట్ దడ పుట్టించింది. పండిట్ రవిశంకర్‌ని కలిసి ఆయన శుశ్రూష చేసి ఇండియన్ సంగీతపు లోతుల్ని.. సంగీత సాగరపు రహస్యాల్ని కనుగొందామనుకున్నాను. అదే సమయంలో నేను స్వామి చిదానంద, మహేష్ యోగిల సత్సంగాలకు హాజరయాను.

హిందూయిజంలోని మిస్టరీ.. టైమ్‌లెస్‌నెస్... వందలూ వేలాది దేవుళ్ళ పాంథియన్ నన్ను ఆకర్షించాయి. ఎందరో దేవుళ్ళు... ఎవరి దేవుడు వారికే. భగవద్గీతను పేపర్‌బాక్‌గా చదివాను. ఆ వేదాంతంలోని లోతు.. ఆ శ్లోకాల్లోని సైంటిఫిక్ రెలిజియస్ కన్సెప్ట్స్ నన్ను చెప్పరాని అనుభూతికి గురిచేశాయి. నేను ఇండియన్ స్పెల్‌లో పడిపోయాను. అంతే. బహుశా నేను పూర్వజన్మలో ఇండియన్‌నేమో ననుకునేవాణ్ణి! డామ్ ఫూలిష్‌నెస్!

జార్జి హారిసన్, జాన్ లెన్నన్లలాగా మహేష్ యోగి శిష్యబృందంలో చేరడానికి నా దగ్గర డాలర్లూ, పౌండ్లూ లేవు. సర్వసంగ పరిత్యాగులమని చెప్పుకునే యోగుల ప్రాపకం కావాలంటే మస్తుగా డబ్బు కావాల్సిరావడం చాలా ఫన్నీగా ఉండేది. ఓ విధంగా హిందూయిజం చాలా ఖరీదైన మతం అనిపించేది. అది డాలర్ల మతం. పౌండ్ల మతం. రోల్స్‌రాయిస్ కార్లమతం అనిపించేది.

కాని, ఇండియాలో మాత్రం పరిస్థితి వేరని గ్రహించాను. హృషీకేష్‌లో.. హరిద్వార్‌లో.. బెనారస్‌లో.. మద్రాస్, బొంబాయి, కలకత్తా, ఢిల్లీ నగరాల్లో.. కోవలమ్, గోవా బీచిల్లో... నేను ఇండియాను చూశాను. ఈ దేశపు ఔన్నత్యం... ఈ దేశపు దౌర్భాగ్యం అన్నీ చూశాను. దుర్భరమైన ఆకలిని నేను ఎన్నో రోజులు అనుభవించాను.

ఓసారి విషజ్వరంతో రిషీకేష్‌లో పడి ఉంటే ఓ సన్యాసి నన్ను రక్షించాడు. ఏవో పసరులు, మాత్రలు తనే స్వయంగా చేసి నాతో తినిపించి నాకు ఆరోగ్యం వచ్చేవరకూ అతడి ఆశ్రమంలో ఉండటానికి అనుమతించాడు. అతడి శిష్యులు నన్ను తమ సోదరుడిలా చూసుకున్నారు. నాకు స్వస్థత చిక్కిన తరువాత సన్యాసి అన్నాడు–

"ఏ గూటి పక్షి ఆ గూటికే చేరక తప్పదు మాక్స్!"

"స్వామీ! నేను ఇక్కడే ఉండి తమ సేవ చేసుకుంటాను. నాకు హిందూయిజం గురించి తెలుసుకోవాలని ఉంది" అన్నాను.

ఆయన చిరునవ్వు నవ్వి–

"వెర్రివాడా! తెలియని వ్యామోహంతో నీవు అర్థంకాని వాటికోసం అర్రులు చాస్తున్నావు. నీవు ఇక్కడ ఉండలేవు. ఇవన్నీ నీ వయసువల్ల సంభవించిన అజ్ఞానపు ఆలోచనలు. కొద్ది రోజుల్లో నీకే తెలుస్తుంది. వెళ్ళిరా నాయనా" అన్నాడు.

ఈ జీవితకాలంలో నాకు కావలసిందేమిటో ఇప్పటికీ నాకు తెలియడంలేదు

డాక్టర్.

సంగీతం... మ్యూజిక్.. రాగాలు.. కన్సర్ట్స్. ఎలాగో నాలుగు రూపాయిలు సంపాదించి ఎన్నో కన్సర్ట్స్ విన్నాను. రవిశంకర్.. విలాయత్ ఖాన్.. అంజాద్ అలీ... బిస్మిల్లా... జాన్ హిగిన్స్ ఒకల్.

మద్రాస్‌లో జాన్ హిగిన్స్ దగ్గర ఓవారం రోజులున్నాను. హిగిన్స్ సాధన నన్ను ముగ్ధుణ్ణి చేసింది.

అతడు పాడిన 'ఎందరో మహానుభావులు', 'శివశివ యనరాదా!' భక్తి, శ్రద్ధ రెండూ కలిపి సాధనచేసి చరితార్థుడయాడు హిగిన్స్...

చరిత్రాత్మకంగా మహోన్నతమైన దేశం ఇండియా. ఈ దేశపు సంస్కృతీ ప్రాభవాలను అర్థం చేసుకోవాలని వచ్చే లక్షలాది జనంలో నేను ఒకడినయినాను.

శాంతి ఎరుగని... డర్టీ...ఫిల్దీ..హంగ్రీ ప్రతి క్షణం ఆకలి జ్వాలలు నన్ను కాల్చి వేస్తుండగా ఏ మాత్రం పట్టుపడని సంగీతాన్ని మచ్చిక చేయాలనే అభిలాషతో ఇండియా అంతా తిరిగాను. ఈ సమయంలో పండిట్ రవిశంకర్ యూరపియన్ టూర్‌కి వెళ్ళిపోయాడు. ఆయనను కలవడం అసలే పడలేదు. డాక్టర్! నాకనిపిస్తుంది. నేను ఇండియా వచ్చింది నిజానికి న్యూయార్క్ నుండి పారిపోవడానికేమోనని.

న్యూయార్క్ స్కై స్క్రేపర్ల చెట్లు ఏపుగా పెరిగిన భయంకర కాంక్రీట్ జంగిల్! అక్కడ పుట్టి పెరిగినవాణ్ణి నేను. డబ్బు, తిండి, సెక్స్‌తప్ప జీవితంలో మరో ఏ ఆలోచనా లేని మనుషుల మధ్య పెరిగిన మనిషిని. ఇండియా నాకు ఓ ఎస్కేప్! మ్యూజిక్ ఓ మిష. నేను చేరింది నా ఊహకందని మిస్టరీ. కాంప్లెక్సిటీ. నా అన్వేషణకి అతీతమైనదేశం. ఐ గేవప్!

ఏం చేయాలి? బాక్‌టు న్యూయార్క్! ఇంటికిపోయి జీవితాన్ని ఏ విధంగా మలచుకోవాలో అర్థం కావడం లేదు. ఎప్పుడో తెంపి వదిలేసిన దారాలని వెదికి పట్టుకోవాలి. ఓ లార్డ్!

నేను కూడా ఏమీ మాట్లాడకుండా కూర్చున్నాను. అనడానికి మాత్రం ఏముంది?

"నాకేం చేయాలో తోచడంలేదు డాక్టర్! అమెరికా నాకు కొత్తగా కనిపిస్తుంది. నా తరం మనుషుల భాష జార్గన్. అంతా మారిపోయి ఉంటుంది. వాళ్ళ ఆలోచనా సరళి వేరు. వాళ్ళ కన్సర్న్ వేరు. నేను ఆ సొసైటీలో ఇమడగలనా అనిపిస్తున్నది.

"అంతకంటే ముఖ్యమైన ప్రశ్న, నేనేం చేయాలి? ఇప్పుడు నేనేం చేయగలను? నా తరం వాళ్ళందరూ చదువులు పూర్తిచేసి ఉద్యోగాలు చేసుకుంటూ సెటిలై పోయి ఉంటారు" నిస్పృహతో అన్నాడు బ్రాండన్. అతడిలో చిరుభయం,సందిగ్ధత.హీ లుక్డ్ లాస్ట్!

"ఇవన్నీ చిన్నతనంలో సామాన్యమే బ్రాండన్! అందులోనూ మీ సొసైటీలో ఇండియాలో నీవు గడించిన అనుభవం మంచిదేననుకుంటున్నాను. ఒకటి మాత్రం నీవు గుర్తుంచుకోవాలి. సితార్ విన్న ప్రతి ఒక్కడూ రవిశంకర్ కాలేడు. అది దుర్లభం. నాకు వెస్టర్న్ క్లాసికల్ మ్యూజిక్ అంటే చాలా ఇష్టం. నా దగ్గర ఏవో కొద్దిగా రికార్డులున్నాయి కూడా.

బీతోవెన్, షయికోవ్స్కీ, బాక్ ఛాలా కొద్ది అనుకో అయినప్పటికీ ఎప్పుడేనా సమయం దొరికితే వింటుంటాను. హిందుస్థానీ, కర్ణాటక సంగీతం అన్నా నాకు ఇష్టమే. అలాగని నేను మరో జూబిన్ మెహతా నవాలనే ఉద్దేశంలేదు.

ఎందుకని? నా కెపాసిటీ నాకు తెలుసు బ్రాండన్. జీవితాలు సంతోషదాయకాలు కావాలంటే తెలుసుకోవలసింది ముఖ్యంగా మనం ఏమి చేయాలనుకుంటున్నామో, తరువాత అది చేయగలమో లేదో తెలుసుకోవడం. వీటికి సమాధానాలు ఎంత త్వరగా లభిస్తే అంత మంచిది. ఇంతకీ మించి పోయిందేమీ లేదు. తిన్నగా ఇంటికి పో. చదువు పూర్తిచేసి ఓ మంచి పిల్లని పెళ్ళాడి సుఖంగా ఉండు" అన్నాను.

"థాంక్యూ డాక్టర్! థాంక్యూ ఫర్ సేవింగ్ మి. మీ సెలవు తీసుకోవడానికి వచ్చాను. మీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలియకుండా ఉంది డాక్టర్"

"ఫర్గెట్ ఇట్" అన్నాను నవ్వుతూ.

కరచాలనం చేసి అతడు వెళ్ళిపోయాడు. ఆ తరువాత అతణ్ణి చూడలేదు. ఇప్పుడీ ఉత్తరం చదివాను.

డియర్ డాక్టర్ శశిధర్,

నన్ను మరిచిపోయి ఉంటారనుకుంటున్నాను. నేను ఇండియాలో దారి తప్పి దాదాపు మృత్యుముఖంలో ఉండగా, మీరు, పోలీస్ డిపార్ట్‌మెంటువారు నన్ను కాపాడారు. నన్నెంతో దయతో చూసి ప్రాణాలు నిలబెట్టారు.

ఇన్నేళ్ళుగా మీకు ఉత్తరం రాయనందుకు క్షమించండి.

నేను న్యూయార్క్ తిరిగివచ్చిన తరువాత ఎన్నోసార్లు మీకు ఉత్తరం రాయాలని ప్రయత్నం చేసినప్పటికీ అప్పటి నా మానసిక పరిస్థితిలో నేను ఏదీ ప్లాన్ ప్రకారం చేయలేకపోయాను. మా దేశంలో ఎడ్జస్ట్ కావటానికి దాదాపు ఆరు నెలల పైగా పట్టింది.

ఈ మధ్య కాలంలో నేను డిప్రెషన్‌కు లోనయాను. ఆ సమయంలో ఎన్నో మానసిక సమస్యలతో బాధపడ్డాను. చివరికి సైకియాట్రిస్ట్ సహాయం కూడా తీసుకోవలసి వచ్చింది. మా నాన్నగారు మొదటి రోజులలో నేను గడిపిన జీవితాన్ని పెద్ద తప్పులా అసహనంగా చూసేవారు.

"ఇండియన్ గురూజీ" అనీ "ఓరియంటల్ క్రీప్" అనీ రకరకాల మాటలతో హింసించేవారు. కాని, ఆయన బాధ నాకు తెలుసు, నేను ఆయన్ని సరిగ్గా అర్థం చేసుకున్నాను. నా మీద ఉన్న ప్రేమతో ఆయన ఎంతో బాధపడి ఉంటారు.

నేను అకారణంగా ఇల్లు వదిలి ఆ దేశాలుపట్టి పోవటంవల్ల ఆయన మనస్సు కష్టపెట్టుకుని అలా ఇన్సల్టింగ్‌గా మాట్లాడేవారు కాని, మా అమ్మ ప్రేమతో ఎంతో సహనంతో నన్ను మరో మనిషిని చేసింది.

డిప్రెషన్ నుండి బయటబడి హిప్పీ మత్తు పూర్తిగా వదిలించుకుని మళ్ళీ సభ్య ప్రపంచంలో పడ్డాను.

తర్వాత కుదుట బడ్డ మనసుతో ఉన్న అవకాశాలను పరిశీలించి సరైన నిర్ణయాలు తీసుకున్నాను. మళ్ళీ కాలేజీలో చేరి డిగ్రీ తీసుకోవడం అవసరమనిపించింది. వెంటనే కొలంబియా యూనివర్సిటీలో చేరాను.

పట్టుదలతో చదివి, మూడేళ్ళలో డిగ్రీ తీసుకొని మా నాన్న బిజినెస్‌లో పార్ట్నర్‌గా చేరాను. ఈవెనింగ్ కాలేజీలో చేరి బిజినెస్ మానేజ్‌మెంట్ డిగ్రీ పూర్తిచేశాను. పగలూ రాత్రీ శ్రద్ధతో పనిచేసి బిజినెస్‌లోని మెళకువలు నేర్చుకున్నాను.

మా కంపెనీ బిజినెస్‌లో విపరీతమైన లాభాలు వచ్చేలా బాగా మేనేజ్‌చేసి మా నాన్నగారి అప్రిసియేషన్ పొందాను. ఇప్పుడు నా ధ్యాస ఎక్కువగా బిజినెస్ మీదే ఉంటుంది. ప్రొడక్షన్, క్వాలిటీ కంట్రోల్, మార్కెటింగ్ వగైరా మాటలు నేను సంభాషణల్లో ఎక్కువగా వాడే పదజాలం.

ఇక నా వ్యక్తిగత జీవితంలో ఎన్నో మార్పులు వచ్చాయి. ఫోటో చూసే వుంటారు. ఆమె పేరు లారా. నా భార్య. నా చిన్ననాటి స్నేహితురాలు. మా బాబు వయసు సంవత్సరం.

మరి మ్యూజిక్ ఏమయింది?

ఎప్పుడేనా ఓ అయిదు నిమిషాలు ఖాళీ సమయం దొరికితే నేను నా ఇండియన్ అనుభవాన్ని గురించి ఆలోచిస్తాను.

మనుషులు వయసులో ఉన్నప్పుడు ఏమేమో చేయాలనుకుంటారు. తాము చేరాలనుకున్న ఉన్నతమైన ఎత్తులకి వెళ్ళడం ఆటోమేటిక్ అనీ, చాలా సులభమని అలా జరగడం కేవలం యాంత్రికమనీ భావిస్తారు. ఆ నమ్మకం లేకపోతే బహుశా వాళ్ళు ఆ ప్రయత్నం చేయడం మానేస్తారేమో!

కాని, ప్రయాణం మధ్యంలో సాధ్యాసాధ్యాలు వాళ్ళకి బోధ పడతాయి. ప్రయత్నంలోని కష్టం, సుఖం, హార్ట్‌బ్రేక్, షాటరింగ్ రియాలిటీ, బ్లడ్, స్వెట్, టియర్స్, అన్నీ అనుభవించాక వారు మారతారు. దారిలో కళ్ళెత్తి చేరదామనుకున్న శిఖరాగ్రాన్ని చూస్తే వాళ్ళకి నిజం తెలుస్తుంది. ఆ ఉన్నత శిఖరాన్ని తాము చేరబోవడం లేదని. మరి ఆ సమయంలో లభించే అనుభూతి ఏమిటి? అప్పటివరకూ శ్రమతో తాము సాధించిన ఎత్తునుండి కిందకి చూసి కనిపించే సుందర దృశ్యాన్ని చూచి ఆనందించడం.

ఇప్పుడు నాకు అర్థమైన నిజం. నేను ఎన్నటికీ రవిశంకర్ని కాలేను. అది ఒక ఫూలిష్ టీనేజ్ డ్రీమ్. నాకు జీవితాంతం కృషి చేసినా ఇండియన్ ఫిలాసఫీ అర్థం కాదు. అవుతుందనుకుంటే అంతకంటే పెద్ద ఆత్మవంచన ఉండదు. ఇది స్వచ్ఛమైన నిజం.

మరి ఎందుకు నేను అంత కాలం వృథా చేశాను?

రిషికేష్ స్వామి చెప్పిన మాటలు నిజం!

ఏ గూటి చిలక ఆ గూటికి చేరవలసిందే!

ఇండియన్ ఆకాశపు పందిరి కింద విన్న రాగాలు నన్ను సబ్‌కాన్షస్‌లో వెంటాడుతాయి. కాని, ప్రస్తుతం నేను వినే సంగీతం పూర్తిగా వెస్ట్రన్ క్లాసికల్. నా సంగీత చక్రభ్రమణం పూర్తయింది.

న్యూయార్క్‌లోని టెన్షన్ల మధ్య వ్యాపారపు బ్లడ్‌ప్రెషర్ తగ్గించడానికి, నా మనస్సుకి సేద తీర్చడానికి నా భార్య పియానో మీద వాయిస్తుంది. ఆమె ఇప్పుడు 'మూన్‌లైట్ సోనాటా' వాయిస్తుంటే నేనీ ఉత్తరం రాస్తున్నాను వింటూ.

హిగిన్స్ భక్తి పారవశ్యంతో పాడిన త్యాగరాయ కీర్తనలు, పండిట్ రవిశంకర్ వాయించిన రాగ్‌లలిత్, మాల్కౌన్స్, దర్బారీ, కళ్యాన్, భైరవి, ఎన్నో రాగమాలికలు, పహాడీలు, ఆకలిరాత్రులు, స్పైసీ ఫుడ్. ఇవన్నీ సబ్‌కాన్షస్‌లో దాగిన మధురానుభవాలు. వాటిని చవి చూసింది వేరే లోకంలో. వేరే జన్మలో, వేరే ప్రభావాల కింద. అది ఓ సెపరేట్ రియాలిటీ.

ప్రస్తుతం నా జీవితంలో ఆ అనుభవానికి చోటులేదు. కాని, ఆ రోజుల గురించి నేను ఏ మాత్రం సిగ్గుపడటం లేదు. నా వ్యక్తిగత పెరుగుదలలో ఇదీ ఓ భాగమేననుకుంటాను నేను. ఓ ముఖ్య భాగమనుకుంటాను. ఆ అనుభవాలు స్వీట్‌డ్రీమ్స్, హారిబుల్ నైట్‌మేర్స్. నేను అందుకోలేని ఆకాశపు అంచులు, నేను ఎక్కలేని పర్వత శిఖరాలు. ప్రస్తుత జీవితంలో నేను చేరిన ప్రదేశం నుండి కిందకి చూసినా, వెనక్కి తిరిగి సింహావలోకనం చేసినా నాకు దొరికేది ఆనందమే! మహదానందం. నా ఇండియన్ ఒడెస్సీ అయిపోయింది.

జీవితంలో ఎదురుపడే క్రాస్‌రోడ్స్‌లో ముఖ్యమైనదాన్ని నేను దాటి మళ్ళీ దారిలో పడ్డాను. మీవంటి మంచి మనుషుల సాంగత్యంవల్ల ఇకనుండి అంతా సుగమమే. నేను లారాకి అంతా చెప్పాను. ఆమె అర్థం చేసుకుంది.

మా బాబు పేరు రవీబ్రాండన్. రవిశంకర్‌ని ఆ విధంగా నిరంతరం స్మరించుకుంటాను. ఎప్పుడో భవిష్యత్తులో మేము ఇండియా వస్తాము. తప్పక రావాలని లారా నిర్ణయం కూడా. తాజ్‌మహల్ చూడాలని ఆమె కోరిక. మేము వచ్చేటప్పుడు ఒకనాడు డర్టీ హిప్పీగా తిరిగిన ప్రదేశాలను మళ్ళీ చూస్తాను- వేరే కళ్ళతో, బాధ్యతతో, సానుభూతితో, ప్రేమతో, ఈస్తటిక్ ఐ తో చారిత్రక సత్యాన్ని అర్థం చేసుకోగల జ్ఞానంతో.

ఈసారి ఇండియన్ హాలిడేని సంపూర్ణంగా ఎంజాయ్ చేస్తాను. నా కుటుంబంతో సహా మిమ్మల్ని కలియడానికి ప్రయత్నం చేస్తాను. తల్లికంటే ప్రేమతో నన్ను చూసిన మేట్రన్ సుశీలమ్మకి, నా హృదయపూర్వక అభినందనలు.

మీ కందరికీ మరొకసారి కృతజ్ఞతలు.

మీ మిత్రుడు, ఒకనాటి హిప్పీ

మాక్స్ బ్రాండన్.

బయట చీకటి పడుతోంది. చంద్రోదయం అవుతున్నది.

ఉత్తరాన్ని మరొకసారి చదివాను.

భూమి మీద సృష్టి స్థితిలయాలు నిర్విరామంగా జరుగుతూనే ఉన్నాయి. కాలం ప్రవహిస్తూనే ఉంటుంది. అందులో నీటి బిందువుల్లా కొట్టుకు పోతుంటాం. తెలియని దిక్కులకేసి.. మనం అందరం. మేట్రన్ సుశీలమ్మ రిటైర్ అయి రెండేళ్ళయింది.

ఎక్కడుందో! నాకే తెలియదు. నా రిటైర్మెంట్ కూడా దగ్గర పడుతోంది.

ఈస్ట్!

వెస్ట్!

ప్రాక్పశ్చిమాలు కలిసేది దిక్చక్రపు వంపు దగ్గిరే!

సంస్కృతులు రెండూ వేరు!

మిస్టీరియస్ ఈస్ట్

మెటీరియలిస్టిక్ వెస్ట్

టైమ్‌లెస్ ఈస్ట్

మోడరన్ వెస్ట్

ఎన్నడూ కలియని సమాంతర రేఖలు సంస్కృతీపరంగా.

గాడ్ బ్లెస్ యూ బ్రాండన్ ఫర్ ట్రైయింగ్ టు బ్రిడ్జ్ ది గాప్!

లతా మంగేష్కర్ భైరవి ఆలపిస్తోంది. దీపిక లేచింది. అల్లుతున్న స్వెట్టర్ పక్కన పెట్టి, అన్నం వడ్డించడానికి వంటింట్లోకి వెళ్ళింది.

బయట పుచ్చపువ్వులా వెన్నెల విరిసింది.

*ఆంధ్రప్రభ వారపత్రిక 15.1.1986*